ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	538.80 (185.8360)	4,91,022	30,368
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.90 (3.78)	453.93	540.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.73 (1.11)	162	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.160 | స్కిన్‌లెస్ : రూ.180



ఆయకట్టు మురిసె

సంవత్సరం	నీటి విడుదల తేదీ	నాటి నీటిమట్టం (అడుగుల్లో)	నీటినిల్వ (టీఎంసీల్లో)
2014	ఆగస్టు 06	515.80	141.73
2015	అక్టోబరు 18	510.20	132.01
2016	ఆగస్టు 26	514.20	138.91
2017	నవంబరు 1	576.80	273.81
2018	ఆగస్టు 24	562.60	238.47
2019	ఆగస్టు 12	556.00	223.19
2020	ఆగస్టు 8	557.60	226.83
2021	ఆగస్టు 2	587.60	305.62
2022	జూలై 29	552.80	215.98
2023	క్రాప్‌హాలిడే	------	------

- నేడు సాగర్ ఎడమకాల్వకు నీటివిడుదల
- ఉమ్మడి జిల్లాలో 6.50లక్షల ఎకరాల్లో వరిసాగు
- ఇప్పటికే నారుమడులు పెంచిన రైతులు
- రుణమాఫీ, నీటివిడుదలతో సర్వత్రా హర్షం
- నీటి విడుదల చేయనున్న మంత్రులు

నల్లగొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ఆయకట్టు రైతుల్లో సందడి మొదలైంది. ఓ వైపు రుణమాఫీ అమలుతో బ్యాంకుల నుంచి రుణవిముక్తి కలుగుతుండటం, మరోవైపు వానాకాలం సాగుకు సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 4గంటలకు ఎడమకాల్వకు నీటిని విడుదల చేయనున్నట్టు నీటిపారుదలశాఖ ప్రకటించింది. గత ఏడాది ఆయకట్టుకు నీటివిడుదల లేకపోవడంతో క్రాప్‌హాలిడే ప్రకటించగా, రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది ముందస్తుగా నీటిని విడుదల చేస్తుండడం, అదే సమయంలో పెట్టుబడులకు అవస్థపడకుండా పాతరుణాలు మాఫీ అవడంతో బ్యాంకుల్లో కొత్త రుణాలు పొందేందుకు వెసులుబాటు ఏర్పడింది. దీంతో ఈ సీజన్‌లో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పంటలు సాగుచేయవచ్చని ఆయకట్టు రైతులు అభిప్రాయపడుతున్నారు.

6.50లక్షల ఎకరాల్లో వరి సాగుకు గ్రీన్‌సిగ్నల్

నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తుండడంతో ఆయకట్టు పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని 6.50లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో సాగర్ ఎడమకాల్వ విస్తరించి ఉంది. ఆయకట్టులో ఇప్పటికే బోరుబావుల కింద నారుమడులు చేయగా, కాల్వకు నీటిని విడుదలచేయగానే దుక్కులు తడిపి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు వ్యవసాయశాఖ రెండు జిల్లాల్లో ఎరువుల కొరత లేకుండా అవసరమైన యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులను ఇప్పటికే అందుబాటులో ఉంచడంతో పాటు, బఫర్ స్టాక్‌ను సిద్ధం చేసింది. ఆయకట్టుకు నీటివిడుదల చేస్తుండడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ట్రాక్టర్లు, వరి నాటు యంత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. దీంతో మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ, హాలియా పట్టణాల్లో ట్రాక్టర్ల షోరూమ్‌ల వద్ద, మెకానిక్ దుకాణాల వద్ద మరమ్మతులతో పాటు, కల్టివేటర్లు, దమ్ముచక్రాలను సరిచేసుకోవడం, కొత్తవి అమర్చుకోవడం వంటివి చేస్తున్నారు. కాల్వకు నీటిని విడుదల చేసిన 15 రోజుల్లోపే ఎడమకాల్వపై, అనుబంధంగా నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టుకు కూడా నీటిని విడుదల చేసేందుకు అధికారయంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. దీంతో ఎత్తిపోతల పథకాల కింద ఆయకట్టు రైతులు సాగు పనులకు శ్రీకారం చుట్టారు.

ఏడాది క్రాప్‌హాలిడే అనంతరం నీటివిడుదల

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గత ఏడాది సాగర్ ఆయకట్టుకు క్రాప్‌హాలిడే ప్రకటించడంతో పంటలకు నీటిని విడుదల చేయలేదు. గత పదేళ్ల నీటి విడుదలను పరిశీలిస్తే 2017లో నవంబరులో, 2015లో అక్టోబరులో నీటిని విడుదల చేయగా, మిగిలిన అన్ని సీజన్లలో జూలై, ఆగస్టులోనే నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది కూడా సాగర్ జలాశయంలో నీరు అందుబాటులోకి వచ్చిన వెంటనే నీటిని విడుదల చేయనుండడంతో వానాకాలం పంటలకు సకాలంలో నీరిచ్చినట్లేనని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నేడు క్రస్ట్ గేట్లను తాకనున్న సాగర్ నీటి మట్టం

సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం గురువారం అర్ధరాత్రికి క్రస్ట్ గేట్లను తాకనుంది (క్రస్ట్ గేట్ల నీటి మట్టం 546అడుగులు). సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక పెరగడంతో గంటకు అర అడుగు చొప్పున పెరుగుతూ ఒక్క రోజులో 12అడుగులు పెరిగింది. గురువారం రాత్రి 9గంటల సమయంలో 538.80 అడుగులుగా ఉన్న సాగర్ నీటిమట్టం గురువారం అర్ధరాత్రి 540 అడుగులకు చేరుకుని క్రస్ట్‌గేట్లను తాకనుంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా, గురువారం రాత్రి 9గంటలకు 538.80 అడుగులుగా (185.8360టీఎంసీలు) ఉంది. కుడి కాల్వ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 6,553క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం నుంచి 22,915 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం 30,368క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఇన్‌ఫ్లో 4,91,022 క్యూసెక్కులుగా ఉంది.

నేడు ఎడమకాల్వకు నీటిని విడుదలచేయనున్న మంత్రులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద వస్తుండడంతో ఆయకట్టుకు నీరివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం మధ్యాహ్నం 3.40గంటలకు ఎడమకాల్వ హెడ్‌రెగ్యులేటర్ (పొట్టిచెలమ)వద్ద మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీ కోటిరెడ్డి పాల్గొంటారని అధికారులు తెలిపారు.

సంబరం



నల్లగొండలో మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకమైందని పలు పార్టీలు, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని పలు చోట్ల ఎమ్మార్పీఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ప్రధాని మోదీ, మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం చేపట్టిన వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందన్నారు. ఈ తీర్పుతో సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందన్నారు.

•8లో..

ఆగ్రహం



నల్లగొండలో సీఎం, మంత్రుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహిళలను కించపరిచేలా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు అనుచిత వ్యాఖ్యలు చేశారని గురువారం జిల్లా వ్యాప్తంగా నల్ల బ్యానర్లతో నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మహిళలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

•8లో..



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా ఎస్‌ఎఫ్ఐ నాయకులు

సబ్జెక్ట్ టీచర్లను నియమించాలి

మిర్యాలగూడ, ఆగస్టు 1: ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లను నియమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ కోరారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాఠశాలలో తెలుగు, హిందీ, సోషల్ టీచర్లను నియమించకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులు 500 మంది విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. మూడు సబ్జెక్ట్‌లకు సంబంధించి టీచర్లు లేకుండా, పాఠాలు బోధించకుండా రెండు నెలలుగా పాఠశాల కొనసాగుతోందన్నారు. వెంటనే కలెక్టర్, విద్యాధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జగన్‌నాయక్, నుమాన్, ఎస్ఎఫ్ఐ గర్ల్స్ కన్వీనర్ ప్రసన్న, సూర్య, అఖిల్, రఫీ, వెంకటేశ్వర్లు, బన్నీ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



యాదగిరిగుట్టలో రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట దేవస్థాన అధికారులను బదిలీ చేయొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అనడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలని జూలై 30న అసెంబ్లీలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గుట్టలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు.

•7లో..

దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా సులోచన

•7లో..

సబ్ రిజిస్ట్రార్ల బదిలీలపై దుమారం

నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు

మాదక ద్రవ్యాలను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- పోలీస్ యంత్రాంగానికి అన్ని శాఖలు సహకరించాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- గంజాయి నివారణకు 'మిషన్ పరివర్తన్' : ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఆగస్టు 1: జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం తన ఛాంబర్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్‌కార్డ్)సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్‌శాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి ఎక్కువగా రవాణా అవుతున్న దృష్ట్యా, దీనిపై దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గంజాయి వ్యతిరేక వారోత్సవం నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు, పోస్టర్లు, హోర్డింగులు ఏర్పాటు చేయాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలు, సినిమా థియేటర్లు, స్థానిక కేబుల్ ఛానళ్ల ద్వారా ప్రచారం నిర్వహించాలన్నారు. కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని సూచించారు. గంజాయి నియంత్రణపై మీడియా ప్రతినిధులకు వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, మరుసటి రోజు 2కే రన్ నిర్వహించాలన్నారు. సోమవారం ప్రతీ మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఈ అంశంపై అవగాహన కల్పించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గంజాయి నివారణపై ప్రత్యేక శకటాన్ని, స్టాల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వినియోగం, రవాణా ఎక్కువగా ఉందని, జాతీయ రహదారి నిడివి సుమారు 70కి.మీలు ఉండడంతో రవాణా అనుకూలంగా ఉందన్నారు. గంజాయిని నియంత్రించేందుకు 'మిషన్ పరివర్తన్' ద్వారా పోలీస్‌శాఖ ప్రతీ గ్రామానికి ఓ పోలీస్ అధికారిని ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తోందన్నారు. గంజాయికి బానిసైన వారి కోసం మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వినయోగం ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవోలు రవి, శ్రీరాములు, డీఆర్డీవో నాగిరెడ్డి, డీఎంహెచ్‌వో కళ్యాణచక్రవర్తి, డీఈవో భిక్షపతి, డీఐఈవో దస్రూనాయక్, అసిస్టెంట్ జేడీఏ హుస్సేన్‌బాబు, పాల్గొన్నారు.

ఓటింగ్ యంత్రాల గోదాం తనిఖీ

నల్లగొండ: ప్రతీ నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన గోదాంలను తనిఖీ చేశారు. ఈవీఎం గోదాముల వద్ద భద్రత, పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మోతిలాల్, ఎన్నికల విభాగం డీటీ విజయ్, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.



ఈవీఎంల గోదాము వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్

నకిలీ విత్తనాలపై అధికారులు

నిఘా ఉంచాలి

సీడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సుకేత అన్వేష్‌రెడ్డి



గోదామును తనిఖీచేస్తున్న సుకేత అన్వేష్‌రెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 1: నకిలీ విత్తనాలను అరికట్టేందుకు అధికారులు పటిష్ట నిఘా కొనసాగించాలని సీడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుకేత అన్వేష్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్‌తో కలిసి స్థానిక చిల్లాపురం రోడ్డులోని విత్తనాభివృద్ధి సంస్థ గోదాములను తనిఖీచేశారు. స్టాక్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ దేశంలోనే చరిత్రాత్మకమైనదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి తద్వారా అధిక దిగుబడిని పెంచేలా కృషిచేయాలన్నారు. మార్కెట్లోకి వచ్చే నకిలీ విత్తనాలను అరికట్టేందుకు అధికారులు విత్తన విక్రయ దుకాణాలపై నిరంతరం నిఘా కొనసాగించాలని కోరారు. వ్యవసాయాధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, తమ్మడబోయిన అర్జున్, నాయకులు గంధం రామకృష్ణ, దేశిడి శేఖర్‌రెడ్డి, బత్తుల సాయి ప్రసన్న, అధికారులు కృష్ణవేణి, సంధ్యారాణి, ఆదినారాయణరెడ్డి, వినయ్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో ప్రారంభమైన గర్భాలయ

ద్వారం వెడల్పు పనులు



ద్వారం వెడల్పు కోసం తొలగించిన గుహబండరాళ్లు

నార్కట్‌పల్లి, ఆగస్టు 1: మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి మూలవిరాట్ ఉన్న గర్భాలయ గుహ ద్వారం వెడల్పు పనులు ప్రారంభమయ్యాయి. 15 రోజుల్లోగా ద్వారం వెడల్పు పనులను పూర్తిచేసేలా పనులను అధికారులు వేగవంతం చేశారు. స్వామి దర్శనానికి గుహాలయంలో ఉన్న రాతి బండలు ఆటంకంగా ఉండటంతో రూ.15లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రాక్ కటింగ్ పనులతో పాటు గర్భాలయ ద్వారం వెడల్పు పనులు చేపట్టారు. అయితే ఆలయం లోపల జడల రామలింగేశ్వర స్వామి లింగాకారం మూలవిరాట్టు పానవట్టానికి గ్రానైట్ వేసే ప్రతిపాదనలు ఇంకా సిద్ధం కాలేదు. ఈవో ప్రతిపాదనలు రూపొందిస్తే అంచనాలు తయారు చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

మర్రిగూడ, ఆగస్టు 1: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయలు కృషి చేయాలని మండల విద్యాధికారి గురువారావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా నాస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే-2024) పై కొనసాగుతున్న శిక్షణలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాస్‌లో పాల్గొంటున్న ప్రతీ ఉపాధ్యాయుడు వారి పాఠశాలల్లో విద్యార్థులకు చక్కటి శిక్షణ ఇచ్చి ప్రతిభను వెలికి తీయాలన్నారు. నవంబరు 12న నిర్వహించే పరీక్షకు సిద్ధం చేయాలని సూచించారు. ఈ పరీక్షలో విద్యార్థులు ప్రతిభచాటి జిల్లా, రాష్ట్రానికి పేరు తెచ్చేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. అనంతరం తెలుగు భాషపై రిసోర్స్ పర్సన్ ఉదావత్ లచ్చిరాం, ఇంగ్లీష్, గణిత, పరిసరాల విజ్ఞానం రిసోర్స్ పర్సన్లు విఠల్ నాయక్, రమేష్, ప్రవీణ్ శిక్షణ ఇచ్చారు. శిక్షణను పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మునగాల శ్రీనివాసరావు ప్రారంభించగా, మండల నోడల్ అధికారి బిట్టు శ్రీను, మూడు కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులు బుచ్చయ్య, మాలతి, శారద, సుధీర్‌బాబు, దామోదరాచారి, కృష్ణారెడ్డి, మునగాల శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. కాగా, నాంపల్లి మండలంలోని ముష్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాస్ శిక్షణను రాష్ట్ర పరిశీలకురాలు వాణి పర్యవేక్షించారు.



మర్రిగూడలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో గురువారావు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై గురువారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి ప్రారంభించగా, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, శివశంకర్, చంద్రశేఖర్, ప్రదీప్, పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, లారీ ఢీ

● 15మంది ప్రయాణికులకు గాయాలు

గరిడేపల్లి, ఆగస్టు 1: ట్రావెల్స్ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొని 15 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం పట్టణానికి చెందిన జైశ్రీరాం టూర్ అండ్ ట్రావెల్స్ బస్సులో విజయనగరం, విశాఖపట్టణం, కాకినాడ జిల్లాలకు చెందిన 21 మంది సాయి భక్తులు మినీబస్సులో గత నెల 24వ తేదీన షిర్డీ వెళ్లి, తిరుగు ప్రయాణంలో పలు సాయి దేవాలయాలు దర్శించుకున్నారు. తిరిగి వస్తున్న క్రమంలో బుధవారం సాయంత్రం నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామ శివారులో గల సాయిబాబా ఆలయాన్ని సందర్శించుకున్నారు. అక్కడి నుంచి హుజూర్‌నగర్ వైపువెళ్తుండగా గరిడేపల్లి మండల పరిధిలోని కీతవారి గూడెం గ్రామశివారులోని కోదాడ, మిర్యాలగూడ ప్రధాన రహదారిపై గల పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా హుజూర్‌నగర్ వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ మార్గంలోకి ట్రావెల్ బస్సు వెళ్లి లారీని ఢీకొంది. వైజాగ్‌కు చెందిన బస్సు డ్రైవర్ జోగారావు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు.



కీతవారిగూడెం వద్ద ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు, లారీ

స్థానికుల సహాయంతో అతనిని బయటికి తీశారు. అసిస్టెంట్ డ్రైవర్ హరికుమార్ కాలికి గాయమైంది. మరో ప్రయాణికుడి తలకు గాయాలయ్యాయి. వీరితో పాటు మరో 13మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్, అసిస్టెంట్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ సల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణానదిలో ఈత కొడుతూ వ్యక్తి గల్లంతు




యాదయ్య(ఫైల్)

చిట్యాల, ఆగస్టు 1: దైవదర్శనం నిమిత్తం శ్రీశైలం వెళ్లిన నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన వ్యక్తి కృష్ణానదిలో ఈత కొడుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. చిట్యాల మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చొప్పరి యాదయ్య(65) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా, భార్య ఎల్లమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో చూసేందుకు మల్లికార్జునస్వామిని దర్శించుకుందామని గురువారం తెల్లవారుజామున 10మంది సహచర హమాలీలతో ఓ వాహనంలో అక్కడికి బయలుదేరారు. ఎనిమిది గంటలకు శ్రీశైలంలోని దోమలపెంట చేరుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి దిగారు. ఈత కొడుతుండగా ఒక్కసారిగా వరద ఉధృతి పెరగడంతో యాదయ్య కొట్టుకుపోయాడు. అక్కడేఉన్న సహచరులు పోలీసులకు సమాచారం ఇవ్వగా గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం వరకు ఆచూకీ లభించలేదు.





















ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొన సాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
» 289కి పెరిగిన మరణాలు


పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు– ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.


డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
» జూలై 13న గాజాలో అంతం చేశాం
» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.



కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై
మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)


వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు



కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.





సబ్‌రిజిస్ట్రార్ల బదిలీలపై దుమారం

● నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపణలు ● జీరో సర్వీస్, స్పౌజ్ అమలులో ఆగమాగం ● మంత్రులకు ఫిర్యాదుల వెల్లువ

నల్లగొండ, ఆగస్టు 1: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బుధవారం రాత్రి జరిగిన సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీలపై దుమారం చెలరేగుతోంది. బదిలీలపై నిషేదం విధించడానికి ముందు అన్యుహంగా జరిగిన ఈ బదిలీలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏకకాలంలో రాష్ట్రంలోని మిగితా జిల్లాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో బదిలీలు జరిగాయి. సబ్ రిజిస్ట్రార్‌లతో పాటు చిట్స్ డిపార్ట్‌మెంట్ ఇతర విభాగాల అధికారులను కూడా బదిలీ చేశారు. బదిలీల విషయంలో గడువు పెంచడానికి ముందు సబ్‌రిజిస్ట్రార్‌ల బదిలీకి సంబంధించి ఒక జాబితా తయారు చేసి ఉత్తర్వులు ఇచ్చే ముందే గడువు పెంచడంతో మరో జాబితాను తయారు చేయడంతో పాటు మొదటి జాబితాను తారుమారు చేసి రెండో జాబితాకు ఆమోదముద్ర వేసినట్లు చర్చనడుస్తోంది. కావాలనే రాష్ట్రస్థాయిలో ఓ వ్యక్తి చక్రం తిప్పి బదిలీలను అస్తవ్యస్తం చేశాడని ఆరోపణలు విన్పిస్తున్నాయి. నిబంధనలు ఉల్లఘించారని ఆరోపిస్తూ కొందరు అధికారులు ఇప్పటికే మంత్రులతో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైదరాబాద్ సమీపంలోని ఓ జిల్లాకు చెందిన అధికారి బదిలీల్లో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం.

జీవోల ప్రకారం బదిలీలు జరిగినట్టేనా?

స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు విభిన్నమైన నిబంధనలు జీవోలు ఉన్నాయి. రెండేళ్ల సర్వీస్ పూర్తికాని వారిని బదిలీ చేయవద్దని జీవో 80పేర్కొంటుండగా, జీరో సర్వీస్ ద్వారా సర్వీస్‌తో సంబంధం లేకుండా ఒక రోజు చేశాడా రెండు రోజులు పనిచేశాడా, నెల, రెండు నెలలా అనే తేడా లేకుండా జీరో సర్వీస్ అందరికీ స్థాన చలనం కల్పించాలి. కానీ నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ డివిజన్‌లో ఉన్న ఓ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఎస్ఆర్‌ను మాత్రం ఎందుకు బదిలీ చేయలేదని పలువురు అధికారులు ప్రశ్నిస్తున్నారు. తమకు అనుకూలమైన వారికి పోస్టింగ్ ఇచ్చారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్పౌజ్ విషయంలో ముగ్గురు నుంచి నలుగురు సబ్ రిజిస్ట్రార్‌లకు కూడా బదిలీల విషయంలో అన్యాయం జరిగిందని సమాచారం. జీవోలను పక్కన పెట్టి రాత్రికి రాత్రే బదిలీలు చేయడం ఎందుకు అన్న ప్రశ్న తలెత్తుతోంది.

ఆ నాలుగు కార్యాలయాల్లో ఖాళీలు ఎందుకో?

నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎస్ఆర్ పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలోని భువనగిరి, రామన్నపేట, నకిరేకల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టారు. ప్రస్తుతం బదిలీలపై నిషేదం ఉన్నందున కీలకమైన, అధికంగా డ్యాకుమెంట్లు నమోదయ్యే భువనగిరి, సూర్యాపేటలో ఇన్‌చార్జిలతో నడిపించాల్సి ఉంటుంది. రామన్నపేట, నకిరేకల్ కార్యాలయాలకు కూడా ఇన్‌చార్జి అధికారులను డిప్యూటేషన్‌లపై కేటాయించాల్సి ఉంటుంది. మిగతా ప్రాంతాల్లో బదిలీచేసి ఈ నాలుగు కార్యాలయాలను ఎందుకు పక్కన పెట్టారనే దానిపై గుసగుసలు వినిపిస్తున్నాయి. అనుకూలమైన వ్యక్తులకు అధిక ఆదాయం వచ్చే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను కేటాయించి ఉపయోగపడని వారిని ప్రాధాన్యంలేని కార్యాలయాలకు కేటాయించారని వాపోతున్నారు.

జీరో సర్వీస్ ప్రకారమే బదిలీలు

జీరో సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం బదిలీలు చేసింది. అవసరమైనచోట జీరో సర్వీస్ ద్వారా బదిలీలు చేశారు. బదిలీల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి అయింది. ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదు. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు, జీవోల ప్రకారం బదిలీలు జరిగాయి.

● రవి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ (ఎఫ్ఏసీ)

బదిలీ చేయొద్దనడం విడ్డూరం

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం అధికారులను బదిలీ చేయొద్దని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అనడం విడ్డూరంగా ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆలయ ఉద్యోగుల బదిలీలపై జూలై 30వ తేదీన ప్రభుత్వ విప్‌బీర్ల అయిలయ్య అసెంబ్లీలో మాట్లాడినందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో గుట్టలో గురువారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. గతంలో ఎమ్మెల్యే ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీగా ఉన్నప్పుడు దేవస్థానంలో అవినీతి అధికారులను బదిలీ చేయాలని అనేక ఆందోళనలు చేసిన అయిలయ్య ప్రస్తుతం బదిలీలు ఆరు నెలల పాటు వాయిదా వేయాలని అసెంబ్లీలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను అడగడం అనుమానాలకు తావిస్తోందనిన్నారు. ఆలయ ఉద్యోగులు స్థానికంగా ఉండకుండా ఎక్కువ మంది హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారని, వారికోసం విప్ మాట్లాడం సమంజసంగా లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు జరుగుతుంటే కేవలం యాదగిరిగుట్ట ఉద్యోగుల బదిలీలు ఎందుకు జరగవద్దని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ శ్రీనివాస్, కర్రె ప్రవీణ్, ఉట్కూరి అశోక్‌గౌడ్, గుంటిపల్లి సత్యం, అజీమీర కిషన్‌నాయక్, ఆకుల చంద్రమౌళి ఉన్నారు.

నల్లగొండ జిల్లా ఏసీగా సులోచన బాధ్యతల స్వీకరణ

నల్లగొండ కల్చరల్, భువనగిరి అర్బన్: నల్లగొండ జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా అన్నెపర్తి సులోచన గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏసీగా పనిచేసిన మహేంద్రకుమార్ జూలై 31వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. అదేవిధంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముఖ్య అర్చకుడిగా విధులు నిర్వహించిన వజ్జల లక్ష్మణాచార్యులు ఉప ప్రధానార్చకుడిగా పదోన్నతి పొందారు.

బదిలీలపై వివరణ కోరిన కమిషనర్

భువనగిరి అర్బన్, ఆగస్టు 1: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బదిలీల ప్రక్రియ ఊపందుకుంది. ఈ విద్యాసంవత్సరం గడిచినందున బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని శాసనసభలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరడంతో రాజకీయ దుమారం రేగింది. ఉద్యోగుల పైరవీల్లో భాగంగానే ఈనెల 5వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిచిపోయినట్లు తెలిసింది. బదిలీల ఆప్షన్ ఫారం సమర్పించిన 25మంది ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సమాచారం ఇవ్వాలని దేవాదాయ శాఖ కమిషనర్ కోరారు. ఈనెల 2వ తేదీ హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి రావాలని పిలుపు వచ్చినట్లు సమాచారం.

సమయపాలన పాటించకపోతే చర్యలు

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దామరచర్ల, ఆగస్టు 1: సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. కొద్ది రోజులుగా మండలంలో విషజ్వరాలు అధికమై ప్రజలు అనారోగ్యంతో బాధపడుతుండటంతో గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మండలకేంద్రంలో గ్రామీణ వైద్యులు, అధికారులతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు ప్రారంభించాల్సిన కార్యక్రమాన్ని 8 గంటలకు ప్రారంభించడంతో ఆయన వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలలోపు గ్రామీణ ప్రాంత ప్రజలు తమ వ్యవసాయ పనులకు వెళ్తుంటారని, కావున వైద్యులు ఉదయం 6 గంటల నుంచే పేదలకు వైద్యసేవలందించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నందున వైద్యులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, కాంగ్రెస్ నాయకులు, సిబ్బంది ఉన్నారు.

రుణమాఫీలో అనేక నిబంధనలు : కోటిరెడ్డి



ఎంసీ కోటిరెడ్డి

హాలియా, ఆగస్టు 1: ఎన్నికల హామీలో భాగంగా ఏకకాలంలో రూ. 2 లక్ష ల రుణమాఫీ అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు ప్రస్తుతం రూ.1.50 లోల వరకే రుణమాఫీ చేసి అనేక నిబంధనలు, షరతుల పేరుతో పేర్లు తొలగిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నట్లు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. గురువారం ఆయన శాసనమండలిలో రుణమాఫీపై మాట్లాడారు. అదేవిధంగా ఆరోగ్య శాఖ బదిలీల్లో అనేక అవకతవకలు జరిగాయని, దీనిని మంత్రి దృష్టికి తేవాలన్నారు. విద్యార్థులకు విదేశీ విద్య కోసం గత ప్రభుత్వం రూ. 20 లక్షల రూపాయల రుణాన్ని సుమారు 6వేల మందికి పైగా అందజేసిందని, నేటి ప్రభుత్వం ఇంత వరకు ఈ అంశంపై ఎలాంటి ప్రస్తావన లేదని అన్నారు.

'స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వీరారెడ్డి

నార్కట్‌పల్లి, ఆగస్టు 1: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటినుంచే ప్రణాళికా బద్ధంగా సిద్ధమవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును వెంటనే పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను అర్హులైన పేదవారిని గుర్తించి పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, నాయకులు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, యాదగిరి, బయ్యన్న, రవి, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సదస్సును విజయవంతం చేయాలి



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ, ఆగస్టు 1: నాగార్జునసాగర్ విజయ్‌విహార్ సెమినార్ హాల్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర స్థాయి వినియోగదారుల సదస్సు, వర్క్‌షాపును నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో వర్క్‌షాపునకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సు వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్క్‌షాపునకు 33 జిల్లాల నుంచి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ముస్తఫా, జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు హిమగిరి, నాయకుడు నర్సింహారావు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నల్లగొండ, ఆగస్టు 1: పట్టణంలోని 19వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకునూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీనగర్ కాలనీలో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని రాకపోకలకు ఇబ్బంది జరుగుతుందని, డ్రైనేజీ సమస్య, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు బొంత రమేష్, గోగుల నాగరాజు, పెరిక యాదయ్య, బాలరాజు తదితరులు ఉన్నారు.

కేజీబీవీ పాఠశాల పనులను వేగంగా పూర్తిచేయాలి

మాడ్గులపల్లి, ఆగస్టు 1: మండల కేంద్రం లో చేపడుతున్న కేజీబీవీ పాఠశాల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి విద్యార్థినుల ఇబ్బందుల ను తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నా రు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కేజీబీవీ పాఠశాల వద్ద గురువారం సీ పీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మండలమైన మాడ్గులపల్లిలో నిర్మాణ పనులు ఏడాదైనా పూర్తి చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తిచేయించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పుల్లెంల శ్రీకర్, విష్ణు, మల్లారెడ్డి, వెంకయ్య, నాగరాజు, ఫకీర్ పాల్గొన్నారు.

మహిళలకు సీఎం, మంత్రులు క్షమాపణ చెప్పాలి

నల్లగొండ, ఆగస్టు 1: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు చేసిన క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మహిళ ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట నల్ల బ్యానర్‌తో నిరసన తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రితో పాటు మంత్రులు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలను కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు నిరంజన్ వలీ, మాలే శరణ్యారెడ్డి, కరీంపాషా, సింగం రాంమోహన్, కంచనపల్లి రవీందర్‌రావు, బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మారగోని గణేష్, కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రీ, యుగేందర్ రెడ్డి, జ్యోతి, విమలమ్మ, గోపి, నాగార్జున పాల్గొన్నారు.

● చండూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొత్తపాటి సతీష్, మాజీ ఎంపీపీ, కౌన్సిలర్ తోకల వెంకన్న, కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, బొడ్డు సతీష్, శిరంశెట్టి శ్రీధర్‌బాబు, ఇరిగి రామకృష్ణ, సైదులు, జగదీష్ పాల్గొన్నారు.

● దేవరకొండ పట్టణంలో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ ఎదుట సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో డిండి మాజీ ఎంపీపీ సునీత, పట్టణ మహిళ అధ్యక్షురాలు జయలక్ష్మి, భారతమ్మ, బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● మిర్యాలగూడలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సీఎం దిష్టబొమ్మను ఊరేగించి దహనం చేశారు. బేషరతుగా సీఎం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, నాయకులు ఆంగోతు లలిత, ఎండి.ఇలియాస్, ఎండి.షెనాహాజ్ బేగం, షోయబ్, కుర్ర చైతన్య, స్వర్ణలత, పెండ్యం పద్మ, కోదాటి రమ, ఉమ, జయమ్మ, ఆంజనేయ రాజు, శ్రీనివాసరెడ్డి, జానకిరెడ్డి, చంటి పాల్గొన్నారు.

● హాలియాలో అనుముల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మండలాల అధ్యక్షుడు పిడిగం నాగయ్య, జటావత్ రవినాయక్, కౌన్సిలర్ నల్లగొండ సుధాకర్, పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్‌రెడ్డి, దోరేపల్లి వెంకటేశ్వర్లు, సురభి రాంబాబు, శ్రీకర్, సైదాచారి, హుస్సేన్, ఆవుల శ్రీనివాస్, రాజేష్‌నాయక్, ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.



నకిరేకల్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

● నకిరేకల్‌లో మాజీ జడ్పీటీసీ మాద ధనలక్ష్మి ఆధ్వర్యంలో మెయిన్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, రామన్నపేట మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, నాయకులు ప్రగడపు నవీన్‌రావు, నడికుడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ పల్లె విజయ్, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు చరిత్రాత్మకమైందని పలువురు వివిధ పార్టీలు, ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జిల్లాలోని పలు చోట్ల ఎమ్మార్పీఎస్, బీజేపీ, టీడీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు ప్రధాని మోదీ, సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం చేపట్టిన వర్గీకరణపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందన్నారు. సుదీర్ఘ పోరాటానికి న్యాయం జరిగిందన్నారు.

● ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ పార్టీ ఓట్ల రాజకీయం చేస్తే బీజేపీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీనివాసరావు అన్నారు.

● ఎస్సీ వర్గీకరణ ఉద్యమం కల సాకారమైందని మాదిగ జేఏసీ దేవరకొండ అధ్యక్షుడు రవి అన్నారు.

● ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తొలుత ప్రతిపాదించింది ఏపీ సీఎం చంద్రబాబునాయుడేనని మిర్యాలగూడ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వడ్డెబోయిన శ్రీనివాస్, నుసుం నగేష్ అన్నారు. టీడీపీ ఆవిర్భవించిన అనంతరమే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని అన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలో అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వింజమూరి కృష్ణయ్య, సందే ఏసు, వింజమూరి రవి, జట్టు నరసింహ, వెంకటయ్య, రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

● వేములపల్లిలో మాజీ ఎంపీపీ పుట్టల సునీత హర్షం వ్యక్తం చేశారు.

● మర్రిగూడలో మాజీ ఎంపీటీసీ ఉరిపక్క సరితనగేష్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ దళితుల జాతిపిత అని కొనియాడారు.

● నిడమనూరులో ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్ నాయకులు వేర్వేరుగా సంబురాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు బొజ్జ చిన్నామాదిగ, లక్ష్మయ్య, రవి, రమేష్, వెంకటేశ్వర్లు, కరుణాకర్ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కూరం లింగయ్య, ధనుంజయ, బట్ట శ్రీనివాస్, వెంకన్న, యల్లయ్య, అనిల్, వెంకన్న పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో రాజకీయ పార్టీలకతీతంగా మాదిగలు సంబురాలు నిర్వహించుకున్నారు. నాయకులు చిరుమర్తి యాదయ్య, యాదయ్య, నాగరాజు, చింత సైదులు, లక్ష్మణ్, ఆదిమల్ల యాదగిరి, లింగాల రాములు, చింత మహేష్, బండారు రామలింగం, బోడ శేఖర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన కార్యక్రమంలో శంకర్, గోపాల్ పాల్గొన్నారు.

● మాడ్గులపల్లిలో మాదిగ జర్నలిస్టుల ఫోరం మండల అధ్యక్షుడు చిట్యాల సైదులు మాట్లాడుతూ వర్గీకరణతో మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు.

మాదిగ ఉద్యమాన్ని చీల్చింది బీఆర్ఎస్ : వేముల వీరేశం



నార్కట్‌పల్లి: మాదిగ ఉపకులాలకు న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాన్ని చీల్చి ముక్కలు చెక్కలు చేసింది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే వీరేశం ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అంటేనే మాదిగ ఉపకులాల వ్యతిరేక పార్టీ అని దుయ్యబట్టారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాదిగ ఉపకులాల్లో వెలుగులు నింపిందన్నారు. మాదిగ సామాజిక వర్గాల కష్టాలు తెలిసిన సీఎం రేవంత్‌రెడ్డి అప్పట్లోనే రిజర్వేషన్ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన విషయాన్ని వీరేశం అసెంబ్లీలో గుర్తుచేశారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

డిండి, ఆగస్టు 1: అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకచారి అన్నారు. మండలంలోని గోనబోయినపల్లిలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంతకాలంగా రేషన్‌కార్డులు జారీ కాకపోవడంతో, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోలేక అర్హులైన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రజలకు రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో పథకాలకు నోచుకోలేకపోతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు జారీ చేయాలన్నారు. సమావేశంలో రాసమళ్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు హనుమాండ్ల కేశవులు, నడింపల్లి మల్లయ్య, పురుషోత్తం, గుండు పెద్దయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న యువకులు

అడవిదేవులపల్లి, ఆగస్టు 1: మండలంలోని చాంప్లా తండా, వస్త్రం తండాల్లో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పెళ్లికాని గిరిజన యువతులు బుట్టలో గోదుమ విత్తనాలు చల్లి మొలకలు వచ్చే వరకు నీటిని చల్లుతారని. మొలకెత్తిన బుట్టలను ప్రత్యేక వస్త్రధారణతో ఆడిపాడి సమీప వాగుల్లో నిమజ్జనం చేస్తారన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో వసతులు మెరుగుపరచాలి



కేతేపల్లి హాస్టల్‌లో వసతులను పరిశీలిస్తున్న నాయకులు

కేతేపల్లి, మర్రిగూడ, ఆగస్టు 1: ప్రభుత్వం సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో వసతులను మెరుగుపరచాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంటెపాక కృష్ణ, బొట్టు శివకుమార్ అన్నారు. జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న సంక్షేమ వసతి గృహాల అధ్యయన యాత్రలో భాగంగా గురువారం కేతేపల్లి, మర్రిగూడ మండలాల్లోని సాంఘీక సంక్షేమ వసతిగృహాన్ని కేవీపీఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహం మరుగుదొడ్ల నిర్వహణ, హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, వసతులను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు, పాకెట్ మనీ పెంచాలన్నారు. ప్రస్తుత వానాకాల సీజన్‌లో దోమల నివారణకు దోమ తెరలు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని కోరారు. కేతేపల్లిలో కేవీపీఎస్ మండల కార్యదర్శి వంగూరి వెంకన్న, నాయకులు గోలి ఎల్లయ్య, పెరిక మల్లయ్య, మర్రిగూడలో నిర్వహించిన కార్యక్రమంలో బాణావత్ దేవా, మిట్టపల్లి ఆనంద, పర్వతం కిరణ్ కుమార్, సైదులు, నరసింహ, యాకోబు, యాదయ్య, భరత్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

చండూరు రూరల్, నల్లగొండ రూరల్, చింతపల్లి, తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 1: తల్లి పాలు అమృతంతో సమానమని, పిల్లలకు తల్లిపాలే శ్రేష్కరమని పలువురు పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడతూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, అవే పిల్లలకు మొదటి టీకాలాగా పనిచేస్తాయని అన్నారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బాలింతలకు పౌష్టికరమైన ఆహారం అందించాలని, అలాగే తల్లీ బిడ్డలను ఎలా జాగ్రత్తగా చూసుకోవాలో తగు సూచనలు తెలియజేశారు.

●చండూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎంసీ సభ్యురాలు బి. ప్రసన్న, అంగన్‌వాడీ టీచర్లు బి. శోభ, టి. జ్యోతి, వీవోఏ పి. జ్యోతి, ఎస్‌హెచ్ఏ వి.సుజాత, ఏఎన్ఎం మహేశ్వరి, ఉపాధ్యాయు లు సరిత, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

● నల్లగొండలో నిర్వహించిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్, 8వ వార్డు కౌన్సిలర్ బొడ్డుపల్లి లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, వినోద, సరోజిని, ఆశా వర్కర్ శైలజ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.



నల్లగొండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మహిళలు

● చింతపల్లిలో అంగన్‌వాడీ టీచర్ పద్మావతి, ఆయా పుల్లమ్మ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండలంలోని శీత్లతండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్ఎం కె.సరిత, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎం రామలింగమ్మ, సుగుణ, సుజాత పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా మారిన తహసీల్దార్



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

చందంపేట, ఆగస్టు 1: చందంపేట మండలానికి చెందిన తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఉపాధ్యాయుడిగా మారారు. ప్రజాపాలన దరఖాస్తుల పరిష్కారంలో ఎంత బిజీగా ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని మరవలేదు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠాలు బోధించారు. గతంలో తాను ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగానని, పోటీ పరీక్షలు రాసి ఉన్నత స్థానానికి చేరుకున్నానని విద్యార్థులకు తెలిపారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ సిబ్బంది అనిల్, ఆర్ఐ నజీర్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 1: పట్టణంలోని తులసీనగర్‌లో గల శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 2వ తేదీన రాత్రి 7 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా శ్రీ విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కుశలయ్య తెలిపారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం నుంచి శివలింగానికి రుద్రాభిషేకాలు, స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బిందెడు నీటికి బండెడు కష్టాలు

చింతపల్లి, ఆగస్టు 1: చింతపల్లి మండలం గొడుకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వర నగర్ (మాల్) ముత్యాలమ్మ కాలనీలో నివాసముంటున్న ప్రజలు నీటి కోసం ఇబ్బందు లు పడుతున్నారు. సాగర్ - హైవే సమీపంలో ఉన్న బోర్ మోటార్‌పై మూడు రోజుల క్రి తం అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బోర్ మోటార్ మరమ్మతులకు గురవడం తో నీటి సరఫరా నిలిచిపోయింది. కాలనీవాసులు ఆటోకు రూ.500 డబ్బులు వెచించి కొనుగోలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. దీంతో మిషన్‌భగీరథ నీరు అరకొరగా విడుదల చేస్తుండటంతో బిందెడు నీటి కోసం బండెడు కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమపై పంచాయతీ కార్యదర్శి పద్మను వివరణ కోరగా కాలవాసులకు బోర్‌మోటార్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నాం. లారీ అదుపు తప్పి బోర్‌మోటర్‌పై రావడం వల్ల మరమ్మతులకు గురైంది. రెండు రోజుల్లో బోర్ మోటర్‌ను మరమ్మతులు చేయించి నీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: మండలంలోని ఇటుకలపహాడ్ గ్రామంలో చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో తన తండ్రి యంగలి అంజయ్య జ్ఞాపకార్థం ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణ గౌడ్ బాడీ ఫ్రీజర్‌ను గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

నిడమనూరు: ప్రమాదంలో గాయపడిన ఓ డ్రైవరుకు తోటి డ్రైవర్లు ఆర్థికసాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. నిడమనూరు మండలంలోని బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన ధర్మారపు మనోహర్ అనే డీసీఎం డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. మనోహర్ పేదవాడు కావడంతో మెరుగైన వైద్యచికిత్స అందించాలనే ఆలోచనతో మండలంలోని తోటి డ్రైవర్లు రూ.20 వేల నగదుతో పాటు 50 కిలోల బియ్యం గురువారం స్థానిక ఎస్ఐ గోపాల్‌రావు చేతుల మీదుగా మనోహర్‌కు అందించి ఔదార్యం చాటుకున్నారు.

చండూరు: బడుగు, బలహీన వర్గాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంలాంటిదని చండూరు మునిపిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాతవెంకటేశ్‌యాదవ్ అన్నారు. ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సిఫారసుతో చండూరు మునిసిపాలిటీలోని పలువురు లబ్ధిదారులకు రూ.9,11,500ల చెక్కును గురువారం పంపిణీ చేశారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని కొంపల్లి గ్రామంలో అక్రమంగా కొందరు అనర్హులు ప్రభుత్వ పెన్షన్లను పొందుతున్నారని దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళ సంఘం అధ్యక్షురాలు పెయ్యల గీత అన్నారు.

కనగల్: మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యాకాలపు ఊషయ్య(90), కనగల్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంద మారయ్య(75) అనారోగ్యంతో మృతి చెందారు.

సీజ్ చేసిన బోరు కోసం ఆత్మహత్యాయత్నం



తహసీల్దార్ కార్యాలయం ఎదుట పడిపోయిన బాధిత రైతు మల్లారెడ్డి

గుర్రంపోడు, ఆగస్టు 1: బోర్ సీజ్ చేయడంతో పంట ఎండిపోతుందని ఓ రైతు ఆవేదనతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఈ సంఘటన జరిగింది. మండలంలోని తెరాటిగూడెం గ్రామానికి చెందిన అన్నదమ్ములైన కసిరెడ్డి రామకృష్ణారెడ్డి, కసిరెడ్డి చినమల్లారెడ్డిల మధ్య భూవివాదం నడుస్తోంది. పది రోజుల క్రితం కసిరెడ్డి రామకృష్ణారెడ్డి తన సోదరుడైన కసిరెడ్డి చిన మల్లారెడ్డిపై వాల్టా చట్టం అమలు చేయకుండా బోరు వేశాడని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులు వారం రోజుల క్రితం చినమల్లారెడ్డి బోరును సీజ్ చేశారు. బత్తాయి మొక్కలు, రెండు ఎకరాల వరి పొలం నీరు లేక ఎండిపోతోందని బోరు సీజ్ తీయించాలని చిన మనమల్లారెడ్డి వారం రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌కు తన గోడును వెళ్లబోసుకుంటున్నాడు. అదే సమయంలో ఆర్ఐ మురళీకృష్ణ ఎమ్మెల్యే వద్దకు వెళ్లు అని సమాధానం ఇచ్చాడు. దీంతో మనస్తాపానికి గురైన చినమల్లారెడ్డి గుర్రంపోడులో క్రిమి సంహారక మందు కొనుగోలు చేసి తిరిగి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. అధికారులు తమ సమస్యను పట్టించుకోవడం లేదని కార్యాలయం ఎదుట పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికుల పోలీసులకు సమాచారంతో ఎస్ఐ శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని చినమల్లారెడ్డిని 108లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన లింగయ్య

చండూరు, ఆగస్టు 1: తాటిచెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చండూరులో గురువారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరుకు చెందిన నక్కపోతు లింగయ్య వృత్తిలో భాగంగా గురువారం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. గమనించిన చుట్టపక్కల గీత కార్మికులు లింగయ్యను చికిత్స నిమిత్తం చండూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వ్యవసాయ బావుల వద్ద కాపర్ వైర్ చోరీ

చిట్యాలరూరల్, ఆగస్టు 1: వ్యవసాయ పొలాలకు నీటిని సరఫరా చేసేందుకు బావుల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న సుమారు 40 వ్యవసాయ మోటార్ల వద్ద కనెక్షన్లకు సంబంధించిన కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గుండ్రాంపల్లిలో జరిగింది. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం... రోజువారీలో భాగంగా రైతులు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి పొలాలకు నీరు వదిలేందుకు మోటార్ల వద్దకు వచ్చి ఆన్‌చేయగా అవి పనిచేయకపోవడంతో వైర్లను పరిశీలించారు. సుమారు 40మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్లను దొంగలు కత్తిరించి తీసుకెళ్లారు. వ్యవసాయ సీజన్ కావడంతో పొలాలకు నీటినందించాల్సిన సమయంలో దొంగలు వైర్లు ఎత్తుకెళ్లడంతో రైతులు ఆందోళనలో చెందుతున్నారు. బాధిత రైతులు లింగస్వామి, నర్సింహ, మల్లేష్, రాందాస్, వెంకటయ్య, స్వామి ఫిర్యాదు చేశారు.